పాలిథిన్ కవర్ల నిషేధమెక్కడ..?

- నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- దుకాణాలు, బ్రాందీ షాపుల వద్ద యథేచ్ఛగా విక్రయాలు
- నామమాత్రంగా తనిఖీలు
- పర్యావరణానికి తప్పని ముప్పు

బోట్‌క్లబ్: పాలిథిన్ కవర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. కాకినాడ నగరంలో ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లే దర్శనమిస్తున్నాయి. కూరగాయలు, సరకులు, పండ్లు ఇలా నిత్యావసర సరకులన్నీ ఈ క్యారీ బ్యాగుల్లోనే తీసుకువెళుతున్నారు. నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. సుమారు ఆరు లక్షలపైగా జనాబా ఉన్నారు. ప్రతి రోజు పారిశుధ్య సిబ్బంది 150 టన్నులకు పైగా చెత్తను సేకరిస్తున్నారు. వీటిలో మూడు నుంచి నాలుగు టన్నుల నిషేధిత ప్లాస్టిక్ కవర్లే ఉంటున్నాయి. చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో పర్యావరణానికి పెను ముప్పు వాటిల్లుతోంది. నగరంలో పాలిథిన్ క్యారీ బ్యాగ్‌లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయించే ప్లాస్టిక్ దుకాణాలు పెద్ద ఎత్తునే ఉన్నాయి. అధికారులకు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో యథేచ్ఛగా వ్యాపారాలు సాగించుకుంటున్నారు. హడావుడిగా దుకాణాలపై దాడులు చేస్తూ నామమాత్రపు అపరాధ రుసుం విధిస్తున్నారు. తర్వాత పట్టించుకోవడం మానేస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా తనిఖీలు చేయకపోవడంతో ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. ప్రజలు పాలిథీన్ కవర్లలో ఆహార పదార్థాలను ఇళ్లకు తీసుకెళ్లి తినడం తరువాత వాటిని రోడ్లపై పడవేస్తుండడంతో మూగజీవాలు వాటిని తిని ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నాయి.


నిషేధిత వాటర్ ప్యాకెట్ బస్తాలు ఆటోలు తరలింపు

వాటర్ ప్లాంట్ తనిఖీలు నిల్

కాకినాడ నగరంలో సుమారు 50కిపైగా మినరల్ వాటర్ విక్రయించే ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో చాలా వరకూ నిషేధిత ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్రతిరోజు బస్తాలు వీటిలో ఆటోల్లో తీసుకెళ్లి వివిధ దుకాణాలు విక్రయిస్తున్నారు. అయినప్పటికీ అధికారులెవ్వరూ వారిపై చర్యలు తీసుకోవడం లేదు.


నగరంలో ఒక బ్రాందీ షాపు సమీపంలో పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్లాకెట్లు

బ్రాందీ షాపుల సమీపంలో అమ్మకాలు

బ్రాందీషాపులు సమీపంలో ఉన్న చిన్న దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. దీంతో మద్యం బాబులు వాటితో మద్యం సేవించి రోడ్లుపైనే పడేస్తున్నారు. దీంతో సమీపంలో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్‌గ్లాసులు ఉంటున్నాయి. అందరూ చూస్తుండగానే వీటిని విక్రయిస్తున్నారు. కానీ అధికారులకు కనిపించడం లేదు.

కేసులు నమోదు చేస్తున్నాం



కాకినాడ నగరంలో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగం తగ్గించేందుకు చర్యలు తీసుకొంటున్నాం. గత నెలల్లో నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించి 200 కేసులు నమోదు చేశాం. బ్రాందీషాపులు వద్ద అధికంగా ఈ ప్లాస్టిక్ గ్లాసులు వినియోగం గమనించి వారికి నోటీసులు ఇస్తున్నాం.

– డాక్టర్ పృథ్వీచరణ్ హెచ్ఎంవో, నగరపాలక సంస్థ

ప్రజల్లోనూ మార్పు రావాలి



ప్రజల్లోను మార్పు రావాలి. బయట మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్‌లు ఇంటిని తీసుకెళ్లాలి. ప్లాస్టిక్ సంచులు ఆవులు తినడంతో ఆవు పాలల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్టు ఇటీవల గుర్తించారు. ప్రజల్లో క్యాన్సర్ కణాలు పెరిగేందుకు ఇదొక కారణం. ప్రభుత్వాలు ప్లాస్టిక్ సంచులు విక్రయించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. వినియోగం వల్ల జరిగే అనర్థాలపై లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం.

– బాదం బాలకృష్ణ, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్

రోడ్లపై నీరు పోయే మార్గమేదీ..!


వలసపాకల జంక్షన్ నుంచి ఆర్టీఓ కార్యాలయం వైపు వెళ్లే కూడలి వద్ద నిలిచిన వర్షపు నీరు

కొద్ది పాటి వర్షానికే జలమయమవుతున్న రోడ్లు

కాకినాడ రూరల్: వర్షా కాలం వచ్చిందంటే గ్రామాల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. కొద్దిపాటి చినుకులే నీరు నిలిచిపోయి పరిసరాలు అధ్వానంగా మారుతాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కాకినాడ రూరల్‌లో రోడ్లు జలయమయంగా మారుతున్నాయి. కొద్ది పాటి చినుకులకే ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లోని చిన్న రోడ్లపై నీరు ఉండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోతున్న ప్రాంతాలను పంచాయతీ అధికారులు గుర్తించి డ్రైనేజీల్లోకి పోయేలా మార్గాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన


రమణయ్యపేటలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు శ్రీదేవిరెడ్డి

కాకినాడ రూరల్: కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించవచ్చని లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద బుధవారం లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలలో ప్రతి అవసరానికి మహిళలు ఇంట్లో పురుషుల సంపాదనపై ఆధారపడకుండా తమ సంపాదనకు కుట్టు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఇప్పటి వరకు 17బ్యాచ్‌లకు కుట్టు శిక్షణలో తర్ఫీదు ఇవ్వడంతో పాటు జీవనాధారం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీఎస్ఎన్ ప్రసూన, శ్రీవాణి, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

- చంద్రంపాలెంలో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

సామర్లకోట: ప్రధాన రోడ్డు మార్జిన్‌లో గొయ్యి ప్రమాదకరంగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. చంద్రంపాలెం పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్ కోసం నాలుగు నెలల క్రితం గొయ్యి తీసి వదిలేశారు. అప్పటి నుంచి గొయ్యిని పూడ్చకపోవడంతో చిన్న వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ రోడ్డులో నడిచి వెళ్లే పిల్లలు ప్రమాదాలబారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగానే ఉన్న గొయ్యిపై పంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో గ్రామ ప్రజలు ముక్కున వేలు వేసుకొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి గొయ్యి పూడ్చి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చంద్రంపాలెంలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

విద్యార్థులకు పోటీలు

పెద్దాపురం: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో బుధవారం ఆయా పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీతారామరాజు జీవిత విశేషాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 3.30 వరకు చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు క్విజ్ పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పోటీలను అనూష, అంజలి, జశ్విత, నమ్రత, ఐశ్వర్య, సాయి హర్ష, భాష నిర్వహించారు.


పీసీసీ ఆధ్వర్యంలో పరీక్షా పోటీల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వైద్య దంపతుల దాతృత్వం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌కు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ ఆయన సతీమణి డాక్టర్ సురేఖలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వీరి కుమారుడు అశ్విన్ పుట్టిన రోజు సందర్భంగా సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో చదువుతున్న బీటెక్ సెకండ్ ఇయర్ విద్యార్థిని నందిత చదువుకు ఆర్థిక సాయాన్ని అందించారు. శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వేదికగా రూ.25వేల మొత్తాన్ని సంస్థ వ్యవస్థాపకుడు డా.బొళ్లం సతీష్ ఆధ్వర్యంలో కుమారుడు అశ్విన్ చేతుల మీదుగా అందజేశారు. కాకినాడ గ్లాస్‌హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరప్రసాద్ మాట్లాడారు. దుర్గాసోము ప్రసాద్ చారిటబుల్ ట్రస్టీలు సోము స్వాతి, రాజ్‌కుమార్, బాబు పెరల్స్ అధినేత హరీష్ దీపిక దంపతులు కర్రి శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.


బీటెక్ విద్యార్థిని నందితకు కుమారుడు చేతుల మీదుగా ఆర్థికసాయమందజేస్తున్న వరప్రసాద్ దంపతులు

దర్జాగా పంచాయతీ స్థలం కబ్జా

- చెరువుగా తవ్వేసిన వైనం
- పట్టించుకోని అధికారులు

కరప: గ్రామ పంచాయతీ స్థలాన్ని ఒక రైతు దర్జాగా కబ్జా చేశాడు. ఆక్రమించిన ఆ స్థలాన్ని చెరువుగా తవ్వేశాడు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లుతున్నాయి. కరప మండలం యండమూరు గ్రామ పంచాయతీ పరిధిలో నాగుల చెరువు ఉంది. ఈ చెరువును ఆనుకుని గ్రామ పంచాయతీకి చెందిన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ నిర్మించారు. అందులోనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, మరి కొంత స్థలంలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న మరి కొంత భాగం(సుమారు 3 కుంచాలు భూమి) కూడా ఖాళీ ఉంటోంది. ఈ భూమిని ఆనుకుని ఒక రైతు కన్ను స్థలంపై పడింది. ఆ రైతు తన భూమిలో చేపల పెంపకానికి చెరువును తవ్వుకుంటూ, పనిలో పనిగా, తనను అడిగేవారు ఎవరు అనుకున్నారో ఏమో మొత్తం మీద పంచాయతీ స్థలాన్ని ఆక్రమించేసి చెరువుగా తవ్వేసి తన భూమిలో కలిపేసుకున్నాడు. గ్రామ పంచాయతీ స్థలం పక్క నుంచే పంచాయతీ, రెవెన్యూ, గ్రామ సచివాలయం సిబ్బంది రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. అయినా పట్టించుకోవడం లేదని యండమూరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి, ఆక్రమణకు గురైన పంచాయతీ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారునిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. యండమూరులో పంచాయతీ స్థలం ఆక్రమణపై విలేకరులకు తెలిపారు.


యండమూరులో ఆక్రమించిన పంచాయతీ స్థలం

కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తా



గ్రామ పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకోవడం చాలా దారుణం. అంతేకాకుండా ఆ స్థలాన్ని చెరవుగా తవ్వేసి తన భూమిలో కలిపేసుకున్న రైతుపై అధికారులు, నాయకులు చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఆక్రమించుకున్న స్థలం విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుంది. గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలాలు గ్రామంలో ఎక్కడెక్కడ ఉన్నదీ, నాకు తెలుసు., పంచాయతీ స్థలం ఆక్రమణపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తాను.

– మారెళ్ల వెంకటరమణ, మాజీసర్పంచ్, యండమూరు.

కెరటాల్లో కొట్టుకొచ్చిన కొబ్బరికాయలు


ఉప్పాడ తీరంలో ఒడ్డుకు కొట్టుకు వచ్చిన కొబ్బరి కాయలు


ఉప్పాడ తీరంలో కెరటాల్లో కొబ్బరి కాయలు

పిఠాపురం: ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాల్లో కొబ్బరికాయలు కొట్టుకు రావడం చర్చనీయాంశంగా మారింది. కెరటాల్లో చేపలు కొట్టుకు రావడం మాత్రమే చూసే జనం కొబ్బరికాయలు కొట్టుకు రావడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. కొబ్బరి కాయలు ఎక్కడి నుంచి కొట్టుకొచ్చాయో తెలియక సముద్రంలో కొబ్బరికాయల లోడుతో వెళుతున్న ఓడ నుంచి పడి ఉంటాయని భావించారు. కాని పిఠాపురంలో ప్రముఖ దత్త దేవాలయాల్లో ఔదంబరీ వృక్షానికి మొక్కుకుని కొబ్బరి కాయలు కట్టడం ఆనవాయితీగా వస్తుంది. అలా కట్టిన కొబ్బరి కాయలను భద్ర పరచి సముద్రంలో కలుపుతుంటారు అలా కలిపిన కాయలే ఒడ్డుకు కొట్టుకు వచ్చినట్టుగా భావిస్తున్నారు. ఏది ఏమైనా కెరటాల్లో కొబ్బరి కాయలు వస్తున్నాయన్న సంగతి తెలిసి పర్యాటకులు స్థానికులు వాటిని చూసేందుకు ఎగబడ్డారు.

మాస్టారు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పని చేసి ఇటీవల బదిలీల్లో రామచంద్రపురం వెళ్లిన ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దాంతో విషయం తెలుసుకున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బుర్ర గోపి మూర్తి బుధవారం సాయంత్రం పరామర్శించారు. శ్రీనివాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, అతని కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. యూటీఎఫ్‌తో పాటు ఎమ్మెల్సీగా తాను అందుబాటులో ఉంటానని ఎటువంటి సమస్య వచ్చినా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి సీతారామయ్య, జిల్లా పత్రిక కనీ్వనర్ పి గిరిధర్ గోపాల్, ఉపాధ్యాయులు కెవీవీ సత్యనారాయణ, డి వీరన్నలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సమావేశం

కాకినాడ రూరల్: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎండీపీఓ పి.సతీష్ తెలియజేశారు. సర్పవరం జంక్షన్ సమీపంలోని రూరల్ మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో 2025–26కు సంబంధించిన సాధారణ నిధుల నుంచి మంజూరైన పనులకు ఆమోదం, ఉపాధి పనులకు ఆమోదంతో ఇతర అంశాలపై తీర్మానాలు ఉంటాయన్నారు. సమావేశానికి సభ్యులు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవ్వాలని కోరారు.

ఎస్ఎస్ఏలో 40 మందికి బదిలీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న పీటీఐ, సీఆర్‌ఎం, ఎంఐఎస్, డేటా ఎంట్రీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో 61 మంది ఉద్యోగులు పాల్గొనగా 40 మంది అభ్యర్థులకు వారు కోరుకున్న చోటుకు బదిలీ ఉత్తర్వులు అందజేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై అధికారుల నిరంకుశ వైఖరికు నిరసనగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహిన్నట్టు జిల్లా ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ ఫౌండర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ బుధవారం తెలిపారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పడేవిధంగా అసలైన లబ్ధిదారులకు ఆ ఫలాలు అందకుండా జరుగుతున్న తాత్సారాలకు ప్రైవేట్ పాఠశాలలను బాధ్యులను చేయడం తగదని, ఈ నిరసనకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి జన్మ నక్షత్ర మైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా మంగళవారం స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి వారికి ఉత్తరా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠకు ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, ఉదయభానోజీరావు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ క్రైం: స్థానికంగా ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 42 పోస్టులు భర్తీ కానుండగా వాటిలో 29 గ్రామీణ, 13 పట్టణ ప్రాంతాలున్నాయి. నెలకు రూ.10వేలు గౌరవ వేతనం, పదో తరగతి ఉత్తీర్ణులైన 25–40 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జ్బ్లుజుజీ ృ్ఛ్చిః ఇజౌ్రి.జీ ఽ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని అనంతరం డౌన్‌లోడ్ చేసి, నిర్ణీత సర్టిఫికెట్ల నకళ్లను జతజేసి ఈనెల ఏడో తేదీ నుంచి 9వ తేదీ సాయంత్రం 5 వరకూ అర్బన్ ప్రాంతానికి చెందిన వారు తమ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు గ్రామ పరిధిలో ఉన్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు అందజేయాలన్నారు.

విద్యుత్ సరఫరాలో రేపు అంతరాయం

కాకినాడ రూరల్: వాకలపూడి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల జరుగుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్. ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. వాకలపూడి ఇండస్ట్రీయల్ ఏరియా, సూర్యారావుపేట, పెనుమర్తి, తమ్మవరం, పోలవరం గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతాప్‌నగర్ సెక్షన్ పరిధిలో... :

కాకినాడ నగరంలో ప్రతాప్ నగర్ సెక్షన్ పరిధిలోని ట్రజరీ కాలనీ ఫీడర్‌పై శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. ప్రతాప్‌నగర్ వాటర్ ట్యాంక్ జంక్షన్, దుర్గయ్య తోట, టీచర్స్ కాలనీ, ట్రజరీ కాలనీ ఏరియాలకు సరఫరా ఉండదన్నారు.

బోట్‌క్లబ్: విద్యుత్ సరఫరాకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ డీఈ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చీడిగ, గుడాల వారి సత్రం, గుడాలవారివీధి, ఆదర్శనగర్, 60 బిల్డింగ్, ఇంద్రపాలెం, పిల్ల కాలవరోడ్డు, నేరేలమ్మ కాలనీ, పల్లపువీధి, మెరకవీధిల్లో ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఎస్వీ రంగారావు కళా స్రవంతి వార్షికోత్సవం

బోట్‌క్లబ్: ఎస్వీ రంగారావు కళా స్రవంతి 11వ వార్షికోత్సవం గురువారం స్థానిక దంటు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు సంస్థ ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నాట్యాచార్య ఎం.వీరమణ శిష్యబృందం నృత్య కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఎస్వీ రంగారావు రాష్ట్ర స్థాయి కళా పురస్కారాలను కర్రి ధర్మరాజు (హరి), పేర్నీడి సూర్యనారాయణకు అందజేస్తున్నట్టు చెప్పారు. ఎస్వీరంగారావు రాష్ట్ర స్థాయి రంగస్థల పురస్కారాన్ని విజయవాడకు నటి కుసుమ సాయి అందించనున్నారు. అనంతరం ఆచమనం నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

26న నాటక కళా రూపాల ప్రదర్శన

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే, యోగి వేమన తదితర నాటక కళారూపాలను ప్రదర్శించిన అభ్యుదయ అకాడమీ, హైదరాబాద్ వారిచే బుద్ధునితో నా ప్రయాణం–డాక్టర్ అంబేడ్కర్ అనే తెలుగు నాటక కళారూపాన్ని కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 26వ తేదీన ప్రదర్శించనున్నారు. ఈ విషయాన్ని అంబేడ్కర్ బౌద్ధ ధార్మిక సంఘాల ప్రతినిధులు బుధవారం తెలిపారు. కాకినాడలో జరిగి అంబేడ్కర్ బౌద్ధ ధార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. బౌద్ధ దమ్మం వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్న డాక్టర్ కేఆర్ఎస్ జవహర్ సౌజన్యంతో ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు అయితాబత్తుల రామేశ్వరరావు, పి రాంప్రసాద్, పి.రామారావు, ఎన్.పెద్దిరాజు, జి.కింగ్, కె.కుమార్, ఎస్.విజయశేఖర్, మౌర్య, ఎం.రమేష్, జె.రవి తదితరులు పాల్గొన్నారు.

21న ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ కరప యూనిట్‌కు ఎన్నిక

కరప: ఈ నెల 21వ తేదీన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ పరిధిలోని కరప యూనిట్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ ఎన్నిక స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల అధికారి, ఏపీఎన్‌జీఓ కాకినాడ పట్టణ యూనిట్ అధ్యక్షుడు ఎ.సత్తిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ కరప యూనిట్ పరిధిలో కరప, కాకినాడ రూరల్ మండలాలు, ఏపీఎస్పీ కార్యాలయం, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసు, పండూరు పీహెచ్‌సీ ఏరియాలలోని ఎన్‌జీఓలు సభ్యులు ఉంటారన్నారు. ఎన్నికల ప్రక్రియ, కరప యూనిట్ ఎన్నికల అధికారిగా తనను, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కాకినాడ పట్టణ కార్యదర్శి డి.రామమూర్తిని, ఎన్నికల పర్యవేక్షణాధికారిగా జిల్లా సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావులను ప్రకటించారన్నారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎన్‌జీఓలు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 10న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ, 21న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎలక్షన్ జరుగుతుందని ఎన్నికల అధికారి సత్తిరాజు తెలిపారు. ఆయా మండల కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ ఉంచామన్నారు.

నేడు పంచారామ క్షేత్రంలో దుర్గాష్టమి పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని మహిషాసుర మర్దిని అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న మహిషాసురమర్దిని ఆలయంలో గురువారం దుర్గాష్టమి పూజలు నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఆషాడ మాసం, అష్టమిని దుర్గాష్టమి మహిషాసురమర్దిని అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. పూజలు అనంతరం అమ్మవారి అలంకరణ ఉంటుందని చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించు కొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆలయ పండితులచే పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

హర్యానాలో సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్


మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: హర్యానా, గురుగ్రామ్‌లో గురు, శుక్రవారంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సుకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఎంపిక అయినట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. 36 రాష్ట్రాల నుంచి చైర్‌పర్సన్లు హాజరవుతూ ఉండగా రాష్ట్రం నుంచి 25 మంది ఎంపిక కాగా వారిలో సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ ఉన్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీఓ వచ్చిందన్నారు. జాతీయ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర, రాజ్యాంగబద్ద ప్రజాస్వామ్యం అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ మేరకు బుధవారం చైర్‌పర్సన్ అరుణ హర్యానా బయలుదేరారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లక్ష్మణదొర

పిఠాపురం: స్థానిక 12వ అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణ దొర నియమితులయ్యారు. ఈయన ఈ బాధ్యతల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం జీవో ఆర్టీ నంబర్ 1099ను ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ విడుదల చేశారు. లక్ష్మణదొర నియామకంపై పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.